## తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తొద్దు

- జిల్లా ప్రత్యేక అధికారి శృతి ఓజా



సమావేశంలో మాట్లాడుతున్నజి ల్లా ప్రత్యేక అధికారి శృతిఓజా

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 6: వేసవిలో తాగునీటి సరఫరాలో జిల్లాలోని ఏఒక్క గ్రామం, పట్టణంలో సమస్య రాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ప్రత్యేకాధికారి శృతిఓజా అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం ఆమె కలెక్టర్ ఉదయ్‌కుమార్‌తో కలిసి ఐడీవోసీలో వీడియో కాన్ఫరెన్స్ హాల్లో మండల ప్రత్యేకాధికారులు, మిషన్‌భగీరథ అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, మున్సిపల్ కమిషనర్లతో వేసవిలో తాగునీటి సరఫరా, సమస్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో తాగునీటి డిమాండ్ ఎంత, సరఫరా ఎంత ఇస్తున్నామనే వివరాలను మిషన్‌భగీరథ కార్యనిర్వాహక ఇంజినీరును ఆమెఅడిగి తెలుసుకున్నారు. పైప్‌లైన్ లీకేజీలు ఎక్కడ ఉండొద్దని, ఎస్‌డీఎఫ్ ద్వారా మిషన్ భగీరథ కొరకు మంజూరు అయిన పనులు యుద్ధ ప్రాతిపదికన రెండు మూడు రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మంచినీటి ఓవర్‌హెడ్ ట్యాంకులపై సరైన మూతలు ఉండేవిధంగా నీటికాలుష్యం జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముందుగా అన్ని చేతి పంపులు మరమ్మతులు చేయించి ఉంచాలని, వాటితో పాటు ప్రభుత్వ బోరుబావులు మరమ్మతులు చేయించి అవసరమైనప్పుడు తాగునీటిసమస్య వచ్చినప్పుడు నీటిసరఫరా చేసేవిధంగా చూసుకోవాలని సూచించారు. అవసరం అయితే ప్రైవేట్ వ్యక్తుల వ్యవసాయ బోరుబావులు సైతం లీజుకు మాట్లాడి సిద్ధంగా ఉంచుకోవాలని తెలియజేశారు. వేసవిలో తాగు నీటి సమస్య తలెత్తకుండా ప్రతిగ్రామంలో, ప్రతిమున్సిపాలిటీ వార్డుల్లో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక చేసుకొని, తాగునీటి సమస్యలను అధిగమించేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. కలెక్టర్ ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ తాగునీటి సరఫరా పర్యవేక్షణకై జిల్లా అధికారులను మండల స్పెషల్ ఆఫీసర్లుగా నియమించడం జరిగిందన్నారు. మున్సిపల్ పట్టణాల్లో కమిషనర్లు, గ్రామాలలో గ్రామ పంచాయతీల కార్యదర్శులు పర్యవేక్షణ జరిపేలా చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లాలోని 20 మండలాల 461 గ్రామ పంచాయతీలు, నాలుగు మున్సిపల్ పట్టణాల్లో నీటికొరతను గుర్తించి ప్రత్యామ్నాయచర్యలు తీసుకుంటున్నామన్నారు. సమావేశంలో అదనపుకలెక్టర్ కుమార్ దీపక్, డీపీవో కృష్ణ, ఈఈలు శ్రీధర్‌రావు, సుధాకర్‌సింగ్, జిల్లా అధికారులు, మండల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ బిల్లులు చెల్లించాలి

నాగర్‌కర్నూల్‌టౌన్, ఏప్రిల్ 6 : ఉపాధి హామీ పథకం కూలీలకు పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నర్సింహా డిమాండ్ చేశారు. నాగర్‌కర్నూల్ పట్టణంలో శనివారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎండల తీవ్రతవల్ల క్షేత్ర స్థాయిలో కూలీలు ఇబ్బందులు పడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. తాగునీటివసతి, మెడికల్ కిట్లు, టెంట్లు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. పెం డింగ్ కూలి డబ్బులు చెల్లించకుంటే అన్ని మండలకేంద్రాల్లో ధర్నాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, కార్యదర్శివర్గ సభ్యుడు బాలస్వామి, నాగరాజు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

వంగూరు, ఏప్రిల్ 6 : రైతులు తమ ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లో విక్రయించి మద్దతుధర పొందాలని ఏవో తనూజ కోరారు. మండలంలోని కొండారెడ్డిపల్లిలో శనివా రం ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏవో, ఏపీఎం చంద్రయ్యలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మా ట్లాడుతూ గ్రేడ్-ఏరకం క్వింటాకు రూ.2,203, గ్రేడ్ బికు రూ.2,183గా మద్దతు ధర నిర్ణయించిందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ సభ్యులు అర్చన, సరిత, క్రాంతికుమార్, ఏఈవో ప్రేమ్‌కుమార్, సువర్ణతో పాటు మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## అచలపీఠం ఆశ్రమంలో అగ్ని ప్రమాదం

లింగాల, ఏప్రిల్ 6: మండలంలోని అప్పాయిపల్లి గ్రామంలోని ఓంకారం అచల పీఠం ఆశ్రమంలో అగ్నిప్రమాదం జరిగి రూ.లక్ష ఆస్తినష్టం వాటిల్లిన ఘటన శనివారం తెల్లవారు జామున చోటు చేసుకున్నది.గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం ఓంకారం అచలపీఠం ఆశ్రమంలో ప్రతి రోజూ భజనకీర్తనలు, కోలాట సాధన చేస్తుంటారు. కాగా శనివారం తెల్లవారు జామున ఆశ్రమంలో ఎవరూలేని సమయంలో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగడంతో ఆశ్రమంలోని నిత్యావసర సరుకులు, తిండిగింజలు, రూ.30వేల నగదు, సంగీత వాయిద్య పరికరాలు దగ్ధమై దాదాపు రూ.లక్ష ఆస్తినష్టం వాటిల్లినట్లు తెలిపారు. సమాచారం తెలుసుకున్న తాసీల్దార్ ఉమ ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. విద్యుత్ షాక్‌తో మంటలు చెలరేగినట్లు ఆమె తెలిపారు. తాసీల్దార్ వెంట ఎంఆర్ఐ అనిల్ ఉన్నారు.

## సాగులో యాంత్రీకరణ పద్ధతులు పాటించాలి




మాట్లాడుతున్న పరిశోధనస ంచాలకుడుమ ల్లారెడ్డి

- ఏడీఆర్ మల్లారెడ్డి

బిజినేపల్లి, ఏప్రిల్ 6: రైతులు పంట సాగులో యాంత్రీకరణ పద్ధతులు పాటిస్తే అధిక లాభాలు పొందవచ్చని వ్యవసాయ పరిశోధనా కేంద్రం సంచాలకు మల్లారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పాలెం గ్రామంలో కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు సదస్సు లో ఆయన మాట్లాడుతూ వ్యవసాయ కళాశాల విద్యార్థులు నాలుగు నెలలు వివిధ మండలాల్లోని 10 గ్రామాల్లో ఉండి రైతులకు అవగాహన కల్పించారన్నారు. రైతులు సాగులో నూతన పద్ధతుల పాటించడం వల్ల సాగు ఖర్చు తగ్గడంతో పాటు అధిక దిగుబడులు సాధించ వచ్చాన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల అసోసియేషన్ డీన్ పుష్పవతి, కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ ప్రభాకర్ రెడ్డి, శాస్త్రవేత్తలు, రైతులు,విద్యార్థులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED
★Wanted Agents, Associates Franchise throughout Telangana for Abroad Medical College Admission. 8881116865 / 8881115253.
NT-311882-All

WANTED
★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-311821-All

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794

# ఆర్థిక సమానత్వమే లక్ష్యం

- ఎస్సీ వర్గీకరణకు బీఆర్‌ఎస్ కట్టుబడి ఉంది
- ఎంపీగా గెలిపిస్తే పార్లమెంట్‌లో సమస్యలపై గళం విప్పుతా
- ఎంపీ అభ్యర్థి ఆర్ ఎస్ ప్రవీణ్‌కుమార్



మాట్లాడుతున్ననా గర్‌కర్నూల్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థిఆ ర్‌ఎస్‌ప్రవీణ్‌కుమార్

బిజినేపల్లి, ఏప్రిల్ 6: అన్ని వర్గాల ప్రజల సామాజిక ఆర్థిక సమానత్వమే లక్ష్యంగా రాజకీయాల్లోకి వచ్చానని బీఆర్‌ఎస్ పార్టీ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్. ప్రవీణ్‌కుమార్ అన్నారు. శనివారం ఆయన మండల కేంద్రంలో దళిత సంఘాల నాయకులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 4 లక్షల మంది ఎస్సీ సామాజిక ప్రజల ఓట్లు ఉన్నాయన్నారు. బీఆర్‌ఎస్‌పార్టీ ఎస్సీవర్గీకరణకు కట్టుబడి ఉందన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం 2015లో నాటి ము ఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా తీర్మానం చేసి కేంద్రానికి పంపారన్నారు. కానీ బీజేపీ ప్ర భుత్వం ఎస్సీ వర్గీకరణను ఆమోదించకపోగా, మరోసారి మాయమాటలు చెప్పి ఓట్లు దండుకొని అధికారం చేపట్టేందుకు సిద్ధమైందన్నా రు. ఏడు సంవత్సరాలు సర్వీసు ఉన్నా ఐపీఎస్ ఉద్యోగానికి రాజీనామాచేసి దళిత, బహుజన వర్గాల గొంతుకై పార్లమెంట్‌లో పోరాడి మన హక్కులను సాధించుకునేందుకు పట్టుదలతో ఉన్నానన్నారు. ఉన్నత వర్గాలచే అణచివేయబడ్డ ప్రతి అనగారిన వర్గానికి చెందిన ఎ స్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజల సంక్షేమం, ఆర్థికాభివృద్ధి సాధించాలంటే నిజాయితీగాపోరా టం చేసే నాయకుడిని పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నుకోవాలన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఎస్సీలను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకుంటున్నాయన్నారు. ఇప్పటికైనా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సామాజిక వర్గానికి చెందిన నాయకులు, యువకులు, ఉద్యోగులు చైత న్యం కావాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీ ఆర్ ఎస్ ఎక్కువ సీట్లు గెలిస్తే రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్ సవరణ చేసి రాష్ట్రంలో కూడా జనాభా ప్రాతిపదికన తమిళనాడు రాష్ట్రంలో లాగా 69 శాతం రిజర్వేషన్ ఫలాలు పొందేందుకు పోరాటం చేయవచ్చన్నారు. సమావేశంలో విజయ్, కుమార్, ప్రదీప్, లక్ష్మయ్య, చెన్నయ్య, కాశన్న, అశోక్, విజయ్‌కాంత్, భూషణ్, లక్ష్మణ్, శ్రీశైలం పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

# మాఫియాలకు అడ్డాగా మార్చిన ఎమ్మెల్యే

- మైలారంలో అక్రమ మైనింగ్‌ను ప్రాణాలు అడ్డేసి అడ్డుకుంటా
- గ్రామస్తులతో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు



గువ్వల బాలరాజువద్ద గోడు వెల్లబోసుకుంటున్నమై లారం గ్రామస్తులు

అచ్చంపేట, ఏప్రిల్ 6 : సీఎం రేవంత్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ కలిసి అచ్చంపేటను అక్రమ మైనింగ్, అక్రమ ఇసుక మాఫియాలకు అడ్డాగా మార్చారని, మైలారంలో అక్రమమైనింగ్‌ను తన ప్రాణాలు అడ్డుపెట్టైన అడ్డుకుంటానని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. శనివారం అచ్చంపేటలోని అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో రైతుదీక్ష శిబిరానికి మైలారం గ్రామస్తులు వచ్చారు. మహిళలు, గ్రామస్తులు వచ్చి గువ్వల బాలరాజును కలిసి బల్మూర్ మం డలం మైలారం గుట్టను మైనింగ్‌కు అప్పగించి తవ్వకాలు జరిపేందుకు వస్తే అడ్డుకొని పంపించామని మైనింగ్ వల్ల తీరని నష్టం జరుగుతుందని మీరే కాపాడాలని మహిళలు మొరపెట్టుకున్నారు. ఈ సందర్భంగా గువ్వల బాలరాజు మాట్లాడుతూ ఎమ్మెల్యే వంశీకృష్ణ అండతోనే మైనింగ్ మాఫియా దిగిందన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు మైనింగ్‌కు అవకాశం ఇవ్వలేదన్నారు. ప్రజలకు మాట ఇచ్చిన ప్రకారం మైలారం గ్రామానికి వస్తుంటే శుక్రవారం రాకుండా ఎమ్మెల్యే వంశీకృష్ణ రానివ్వకుండా పోలీసులద్వారా అడ్డుకున్నారని అన్నారు. తాము మైలరానికి వస్తున్నామంటేనే భయపడి మిషన్లు వెనక్కి వెళ్లిపోయాయని అన్నారు. ప్రజల సహకారంతో మైనింగ్‌ను అడ్డుకొని తీరుతామని హెచ్చరించారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ ప్రజలపక్షాన లేకుండా ఇసుక, మైనింగ్, ప్రజల ప్రాణాలతో వ్యా పారం చేస్తున్న వారి పక్షాన పనిచేస్తున్నారని ఆరోపించారు. పోలీస్ బలగాలతో మైనింగ్‌ను నడిపిస్తామంటే ఊరుకోమని ఎంతవరకైన వెళ్లి అడ్డుకుంటామని హెచ్చరించారు. 15మంది రైతుల సంతకాలు ఫోర్జరీ పెట్టిన కాం గ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై క్రిమినల్ కేసు లు పెట్టాలని డిమాండ్ చేశారు. రైతులు, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి మైనింగ్‌ను ప్రోత్సహిస్తున్న కాంగ్రెస్ నాయకుల భండారం భయటపెడతామన్నారు. తన కంఠంలో ప్రాణం ఉన్నంతవరకు అచ్చంపేటను వీడేదిలేదని, ప్రజాసేవలో ఉంటానన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పు డు పార్టీలు చూడలేదని న్యాయంవైపు, ప్రజలవైపు ఉన్నానన్నారు. ఆయన వెంట స్థానిక నా యకులు చెన్నకేశవులు, బాలరాజు, రాజు, కుత్బుద్దీన్, రాజు, రవి, మైలారం గ్రామస్తులు కార్తకర్తలు పాల్గొన్నారు.

## ఉగాది మహోత్సవాలకు అంకురార్పణ

శ్రీశైలం, ఏప్రిల్ 6 : శ్రీశైల మహాక్షేత్రంలో ఉగాది మహోత్సవాలు శనివారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ఈవో పెద్దిరాజు దంపతులు ఉదయం భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లను దర్శించుకుని వేదపండితులతో కలిసి స్వామివారి యాగశాల ప్రవేశం చేయించి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా గణపతిపూజ, చండీశ్వర పూజ, రుద్రపారాయణం, కంకణపూజ, కంకణధారణ పూజలు చేశారు. అనంతరం భ్రమరాంబ అమ్మవారికి విశేష కుంకుమార్చన, ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను భృంగివాహనంపై అధిష్టింపజేసి విశేష పూజలు నిర్వహించి ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. అనంతరం గ్రామోత్సవ కార్యక్రమాన్ని కనుల పండువగా నిర్వహించారు. కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు కాలినడకన అధిక సంఖ్యలో తరలిరావడంతో క్షేత్ర పురవీధులు కిటకిటలాడుతున్నాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఈవో పెద్దిరాజు, ఈఈ రామకృష్ణ, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ అయ్యన్న, పీఆర్‌వో శ్రీనివాసరావు, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.



భృంగివాహన సేవలో పాల్గొన్న భక్తులు

# ఎన్నికల కోడ్ పాటించరా..?



తొలగించకుండా ఉన్న ఎమ్మెల్యే పోస్టర్

అచ్చంపేటరూరల్, ఏప్రిల్ 6: పట్టణంలో పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులో ఉందా లేదా అని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పట్టణంలోని విద్యానగర్ కాలనీలో కాంగ్రెస్ పార్టీకి చెందిన నాగర్ కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి మల్లురవి, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ వాల్ పోస్టర్ గోడలకు దర్శనమిస్తున్నాయి. ఎన్నికల నిబంధనల ప్రకారం పార్టీల జెండాలు, అభ్యర్థుల ప్రచార పోస్టర్లను తొలగించాల్సి ఉన్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ శ్యాం సుందర్‌ను వివరణ కోరగా విద్యానగర్‌లో వాల్ పోస్టర్లు ఉన్న విషయం తనకు తెలియదని సిబ్బందిచే వివరాలు తెలుసుకొని వెంటనే వాటిని తొలగిస్తామని తెలిపారు.



సత్రాం దవాఖాన వెనుక తొలగించకుండా ఉంచిన పోస్టర్

## గుడుంబా తయారీ స్థావరాలపైదా డులు



నాగురావుపల్లి తండాలో బెల్లంపానకం పారబోస్తున్న ఎక్సైజ్ అధికారులు

వెల్దండ, ఏప్రిల్ 6 : మండలంలోని గుడుంబా తయారీ స్థావరాలపై ఎక్సైజ్ అధికారులు, పోలీసులు సంయుక్తంగా శనివారం దాడులు నిర్వహించారు. మైసమ్మపలుగు తండా, నాగరావుపల్లితండాలో దాడులు నిర్వహించి 1200 లీటర్ల బెల్లం పాకం పారబోశారు. 30 లీటర్ల నాటుసారాను, బైకు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. ఐదు మందిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. సీఐ శారద, ఎస్సైలు మురళి, అరుణ, సిబ్బంది మహేష్, బిక్షపతి, నర్సింహులు గౌడ్ ఉన్నారు.

## పశుగ్రాసం దగ్ధం

అచ్చంపేటరూరల్, ఏప్రిల్ 6: మండలంలోని అక్కారం గ్రామంలో శనివారం ప్రమాదవశాత్తు గడ్డి వాము, వేరుశనగ పొట్టు దగ్ధమయ్యింది. స్థానికులు కథనం ప్రకారం గ్రామానికి చెందిన రైతు కొర్రలాలు తన పొలంలో నిల్వ ఉంచిన గడ్డివాము, వేరుశనగ పొట్టుకు ప్రమాదవశాత్తు నిప్పంటుకోవడంతో మంటలు చెలరేగి పశుగ్రాసంతో పాటు వ్యవసాయ పరికరాలు దగ్ధమైనట్లు తెలిపారు.

## అమ్మ ఆదర్శ కమిటీ ఎన్నిక

లింగాల, ఏప్రిల్ 6: మండలంలోని కోమటికుంటలో అమ్మ ఆదర్శ కమిటీని శనివారం హెచ్‌ఎం అంజిలాల్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదర్శకమిటీ అధ్యక్షురాలిగా అంజలి, కన్వీనర్‌గా హెచ్‌ఎం అంజిలాల్, సభ్యులుగా తల్లిదండ్రులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బచ్చన్న, ఉపాధ్యాయులు తిరుపతి, అనిల్ పాల్గొన్నారు.

# బస్సుల్లేక ప్రయాణికుల పాట్లు



అచ్చంపేటఆ ర్టీసీడిపోలో బస్సులేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్రయాణికులు

కల్వకుర్తి, ఏప్రిల్ 6 : కల్వకుర్తిలో శనివారం బస్సులు పూర్తిస్థాయిలో నడవకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. శనివారం సాయంత్రం కాంగ్రెస్ పార్టీ తుక్కుగూడలో నిర్వహించనున్న జనజాతరకు కాంగ్రెస్ నేతలు జనసమీకరణకు ఆర్టీసీ బస్సులను అద్దెకు తీసుకున్నారు. దీంతో రెగ్యులర్ రూట్లలో వెళ్లే బస్సులు, గ్రామాలకు వెళ్లే బస్సులను కాంగ్రెస్ పార్టీ జనసమీకరణకు కేటాయించారు. ఒక వైపు ఎండ మరో వైపు బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఏదైన ఒక్క బస్సు వస్తే దాంట్లోకి ఎక్కేందుకు ఎగబడ్డారు. ఎంపీ ఎన్నికలను పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల కమిషన్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న నేపథ్యంలో కల్వకుర్తి నుంచి చాలా మంది ఉపాధ్యాయులు శిక్షణకు వెళ్లాల్సి ఉంది. శిక్షణకు వెళ్లే ఉపాధ్యాయులు బస్టాండ్‌లో బస్సులకోసం ఎదురు చూసి బస్సులు రాకపోవడంతో ప్రైవేటు వాహనాలను అద్దెకు తీసుకుని వెళ్లారు. ప్రైవేటు వాహనాల యజమానులు ఎక్కువ డబ్బులు డి మాండ్ చేశారు. ఆర్టీసీ బస్సులను పార్టీ మీటింగ్‌లకు వాడుకోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందని ప్రయాణికులు వాపోయారు.

**అచ్చంపేటలో..**

అచ్చంపేటరూరల్, ఏప్రిల్ 6: అధికార కాంగ్రెస్ పార్టీ శనివారం హైదరాబాద్‌లోని తుక్కుగూడలో నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సభకు అచ్చంపేట డిపోకు చెందిన అనేక బస్సులు వెళ్లడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అచ్చంపేట డిపో నుంచి 40 బస్సులు సభకు జనాలను తరలించడానికి వెళ్లడంతో వివిధ గ్రామాలకు వెళ్లాల్సిన బస్సులు లేక పోవడంతో ప్రయాణికులు బస్టాండ్‌లో నిరీక్షిస్తూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ విషయమై డిపో మేనేజర్ దుర్గ ప్రసాద్‌ను వివరణ కోరగా డిపోలో 83బస్సులకు 40 తుక్కుగూడ సభకు బుక్ చేసుకున్నారని మిగితా బస్సుల ద్వారా ప్రయాణికులను గమ్య స్థానానికి చేర్చుతున్నామన్నారు.

## రూ.500 ఇస్తేనే సభకు వస్తాం..

కల్వకుర్తి, ఏప్రిల్ 6 :జనజాతరకు జనాన్ని సమీకరించేందుకు కాంగ్రెస్ నాయకులు పాట్లు అన్నీఇన్నీ కావు. వచ్చేవారికి రూ.300 ఇస్తామని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు గ్రామాలకు బస్సులను తీసుకెళ్లారు. రూ.300 ఇస్తామని జనజాతరకు రావాలని గ్రామస్తులను కోరారు. చాలామంది రూ.300వద్దని రూ.500ఇస్తే వస్తామని తెగేసిచెప్పారు. ఎం డకు ఏమైన అయితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. ఉపాధికూలీకి 2గంటలు వెళితే రూ.300 వస్తాయని, ఎండకు అంతదూరం రావడం అవసరమా అని అన్నారు. కొన్ని గ్రామాల్లో అయితే ఏం వెలగబెట్టారు.. ఎందుకు రావాలంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. 100 రోజుల్లో ఇచ్చిన హామీలను అన్ని నెరవెరుస్తామన్నారు కదా.. 100రోజులు దాటింది, హామీలన్నీ ఏమయ్యాయని నిలదీశారు. మొత్తం మీద నాయకులు బతిమాలో, గిములాడో జనాన్ని తరలించేందుకు అష్టకష్టాలు పడ్డారు. భారీఎత్తున జనాన్ని సమీకరించాలని కాంగ్రెస్ ఉన్నత స్థాయి నాయకులు భావించారు. కాని జనమే సహకరించలేదు.

## బాక్సింగ్‌లో ప్రతిభ



చరణ్‌సాయి

కల్వకుర్తి, ఏప్రిల్ 6 : బాక్సింగ్ లో జేపీనగర్ గురుకుల పాఠశాల విద్యార్థి చరణ్ సాయి ప్రతిభ కనబర్చారు. పాఠశాల లో 8వ తరగతి చ దువుతున్న చరణ్‌సాయి ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం నోయిడాలో ఇటీవల ని ర్వహించిన జాతీయస్థాయి బాక్సిం గ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొన్నాడు. 61-64కిలోల విభాగంలో సత్తాచాటి ఆల్‌ఇండియా స్థాయిలో 5వర్యాంకు సాధించినట్లు బాక్సింగ్ ఫెడరేషన్ ప్రకటించిందని పాఠశాల ప్రిన్సిపాల్ దానం తెలిపారు. బాక్సింగ్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థిని ఆర్‌సీవో విద్యుల్లత, ప్రిన్సిపాల్ దానం, పీఈటీ, ఉపాధ్యాయులు అభినందించారు.

## వ్యక్తికి తీవ్రగాయాలు

కోడేరు, ఏప్రిల్ 6: ద్విచక్రవాహనం అదుపు తప్పి ఓవ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన మండలంలోని ఎత్తం గట్టు సమీపంలో శనివారం చోటు చేసుకున్నది. గ్రామస్తుల కథనంమేరకు.. వీపనగండ్ల మండలం సంగినేనిపల్లి గ్రామానికి చెందిన మీసాల బాలయ్య తన ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఎత్తం గట్టు సమీపంలో రోడ్డుపై అదుపు తప్పి కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో అతడికి తీవ్రగాయాలు కావడంతో స్థానికులు అంబులెన్స్‌కు సమాచారం అందించడంతో. చికిత్స నిమిత్తం కొల్లాపూర్‌కు తరలించారు.

## 9న కవి సమ్మేళనం

నాగర్‌కర్నూల్‌టౌన్, ఏప్రిల్ 6 : ఉగాది పండుగను పురస్కరించుకొని ఈ నెల 9వ తేదీన కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి సుబ్బయ్య, వహీద్‌ఖాన్ శనివారం ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని సింగిల్‌విండో హాల్‌లో మంగళవారం ఉదయం 10గంటలకు నిర్వహించనున్న కవి సమ్మేళనానికి కవులు హాజరై ఉగాది సామాజిక అంశంపై తమ కవిత్వాన్ని విన్పించాలని కోరారు.

## పేకాట స్థావరంపై దాడులు

బిజినేపల్లి, ఏప్రిల్ 6: మండలంలోని మంగనూర్ గ్రామంలో శుక్రవారం రాత్రి పేకాట స్థావరాలపై పోలీసులు దాడులు జరిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామ శివారులోని లింగారెడ్డికుంట వద్ద కొందరు పేకాట ఆడుతున్నారని విశ్వసనీయసమాచారం మేరకు దాడులు పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వీరివద్దనుంచి రూ.36,970 నగదుతోపాటు ఏడుసెల్‌ఫోన్లు, బైక్ స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి విచారణ నిర్వహిస్తున్నట్లు ఎస్సై నాగశేఖర్‌రెడ్డి తెలిపారు.

## వడదెబ్బ పై కూలీలకు అవగాహన

తిమ్మాజిపేట, ఏప్రిల్ 6 : మండల కేంద్రంలో ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు వడదెబ్బపై శనివారం వైద్యసిబ్బంది అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెల్త్ సూపర్‌వైజర్ గౌస్, ఏఎన్‌ఎం స్వప్న ఎండల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఉదయం సమయంలోనే పనులు చేయాలని, కాటన్ దుస్తులు ధరించాలని, నీళ్లు ఎక్కువగా తాగాలని సూచించారు. వాంతులు, విరేచనా టలు అయితే వెంటనే సమీప ఆరోగ్య కేంద్రాలకు రావాలని సూచించారు. అనంతరం కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందజేశారు. మండలంలో అన్ని గ్రామాల్లో ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, పంచాయతీ కార్యదర్శులకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందజేసినట్లు సూపర్‌వైజర్ గౌస్ తెలిపారు. కార్యక్రమంలో ఫార్మసిస్ట్ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## చెరువులో పడి వ్యక్తి మృతి

బిజినేపల్లి, ఏప్రిల్ 6: ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని వడ్డేమాన్ గ్రామంలో శనివారం చోటు చేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన రాములు (30) గ్రామ శివారులోని బీమా సముద్రం చెరువు వద్ద నిర్వహిస్తున్న దినవారాల కోసం వెళ్లగా ప్రమాదవశాత్తు కాలుజారి చెరువులో పడ్డాడు. చుట్టుపక్కల వారు గమనించి బయటికి తీసేలోపే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగశేఖర్‌రెడ్డి తెలిపారు.